కలుషితంగా కృష్ణా కెనాల్ డ్రెయిన్

- వ్యర్థాలను డ్రెయిన్‌లోకి విడుదల చేస్తున్న వైనం
- తరచూ రోగాల బారిన పడుతున్న ప్రజలు
- ప్రజల్లో చైతన్యం రానంత వరకూ ఇదే పరిస్థితి
- పొంచి ఉన్న ప్రమాదం

ఏలూరు (టూటౌన్): కృష్ణా కెనాల్ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో తాగు, సాగు నీరు అందజేసే కాలువ సైతం మురుగు డ్రెయిన్‌ను తలపించే విధంగా మారిపోయింది. మరి కొద్ది రోజుల్లో కాలువలకు నీరు విడుదల చేస్తే ఈ వ్యర్థాలని దిగువ ప్రాంతాలకు సాగు, తాగునీరుగా వెళతాయి. దీంతో పెను ప్రమాదం పొంచి ఉంటుందనే అభిప్రాయాన్ని నగర వాసులు వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు మినీ బైపాస్ నుంచి ఏలూరు తూర్పు లాకుల వరకూ కృష్ణా కాలువ నగరం నడిబొడ్డు నుంచి దాదాపు ఎనిమిది కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే ఏలూరు నగరాన్ని వన్‌టౌన్, టూటౌన్‌గా ఈ కాలువనే విడదీస్తుంది. కృష్ణాకాలువ నీరు ఏలూరు ప్రజలకు తాగు నీటి అవసరాలు తీర్చే స్టోరేజ్ ట్యాంక్‌కు, దిగువ గ్రామాలకు సాగు, తాగు నీరు అందజేస్తోంది. అయితే నగరంలోని అన్ని రకాల వ్యర్థాలను తీసుకు వచ్చి నేరుగా ఈ కాలువలో వేస్తుండటంతో ఈ కాలువకు ఈ పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. వివాహాది శుభకార్యాలలో వచ్చే వ్యర్థాలు,


పాండురంగా థియేటర్ ప్రాంతంలో వ్యర్థాలతో పేరుకు పోయిన కెనాల్


పోణంగి వెళ్లే కెనాల్ మార్గంలో పేరుకు పోయిన చెత్తా చెదారం

వ్యాపారులు వేసే చెత్త, ఇండ్లలోని ప్రజలు వేసే వ్యర్థాలు కలిపి ఈ కాలువను ఒక మురికి కూపంగా మార్చేసాయంటే అతిశయోక్తి కాదు.

ఫలించని నగరపాలక సంస్థ చర్యలు

కృష్ణా కాలువ ప్రక్షాళనకు ఏలూరు నగరపాలక సంస్థ అనేక చర్యలు చేపట్టింది. కాలువ వెంబడి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలిగించింది. కృష్ణా కాలువలో వ్యర్థాలను వేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ప్రచారం, సమావేశాలు నిర్వహించింది. కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఎన్ని చర్యలు చేపట్టినా అవి ఫలించలేదనేది నగర ప్రజలు చెబుతున్నారు. ఏలూరు నగర ప్రజల తీరు మారకపోవడంతో ఎంతో చరిత్ర కలిగిన కృష్ణా కాలువ నేడు మురికి కూపంగా మారి పోయిందనేది నగరంలోని మేథావులు, సామాజిక కార్యకర్తలు, అధికార యంత్రాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పాతబస్టాండ్ సమీపంలోని కృష్ణా కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

కాలువ ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలి



ఏలూరు నగరంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు తాగు,సాగు నీరు అందించే కృష్ణా కాలువ నేడు దుర్గంధం వెదజల్లుతుంది. గత 20 ఏళ్ల క్రితం కాలువలో రెండు వైపులా నగర వాసులు స్నానాలు చేయడం, బట్టలు ఉతుక్కోవడం వంటి అన్ని అవసరాలను తీర్చుకునేవారు. కార్తీక మాసంలో కాలువకు ఇరువైపులా రేవుల వద్ద ప్రత్యేక వసతులు ఏర్పరచి కార్తీక స్నానాలు చేసేవారు. అటువంటి కాలువ నేడు దాని వైపు కన్నెత్తి చూసేందుకు సైతం ప్రజలు జడుచుకునే పరిస్థితి దాపురించింది. దీని ప్రక్షాళనకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఉక్కుసూరి గోపాలకృష్ణ, బీసీ జెఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏలూరు

వ్యర్థాలను చెత్త రిక్షాలోనే వేయాలి



నగర వాసుల్లో క్లీన్ అండ్ గ్రీన్ పట్ల సామాజిక స్పృహ లోపించడం వల్లే కృష్ణా కాలువకు నేడు ఈపరిస్థితి దాపురించింది. గతంలో ఏలూరు నగరానికి వింత వ్యాధి సోకి వందల సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దానికి సైతం కృష్ణా కాలువ నీరు తాగు నీటి చెరువులోకి కలవడమే అని ప్రజలు భావించారు. అయినా నగర వాసులు గుణపాఠం నేర్వకపోడం బాధాకరం. ఎవరికి వారు వ్యర్థాలను కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు తరలించే చెత్త రిక్షాల్లోనే వేయాలి. కాలువలో నేరుగా వేయవద్దని కోరుకుంటున్నాను.

మల్లిపూడి రాజు, సామాజిక కార్యకర్త, ఏలూరు

క్లుప్తంగా

స్ట్రాంగ్ రూముల తనిఖీ


స్ట్రాంగ్ రూమ్‌ల పరిస్థితిని తనిఖీ చేస్తున్న జేసీ బి.లావణ్య వేణి

ఏలూరు(మెట్రో): దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి బుధవారం తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూముకు వేసిన తాళాల సీళ్లను, సీసీ కెమెరాలను పనితీరును పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర పారా మిలిటరీ బలగాలతో సహా మూడంచెల భద్రతా చర్యలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో ఆమె సంతకం చేశారు.

ఉద్యమ నాయకులకు ఘన నివాళులు


సంకు అప్పారావు, కనకం సోంబసవరాజు వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్య సమరయోధులు, రైతు సంఘం నాయకులు సంకు అప్పారావు, స్వాతంత్ర సమరయోధులు,చేనేత కార్మిక సంఘం నాయకులు కనకం సోంబసవరాజు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక స్ఫూర్తి భవన్ నందు వ్యవసాయ కార్మిక సంఘం, చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సంకు అప్పారావు చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, బసవరాజు చిత్రపటానికి చేనేత కార్మిక సంఘ నాయకులు యర్రా వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమరులైన వారి జీవితాన్ని వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకొని రానున్న రోజుల్లో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా సహాయ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, చేనేత కార్మిక సంఘం నాయకులు కనకం జగన్, సీపీఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రకాశరావుకు ఆత్మీయ వీడ్కోలు


ప్రకాశరావును సత్కరిస్తున్న సీసీఎస్ పోలీసు సిబ్బంది

ఏలూరు (టూటౌన్): ఏలూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్ నందు పనిచేస్తున్న ఎస్ఐ బి.ప్రకాశరావుకు బుధవారం పదవీవిరమణ ఆత్మీయ వీడ్కోలు పలికారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వి మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఇతర సిబ్బంది వీడ్కోలు కార్యక్రమ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకాశరావు 1984లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరి పూర్వపు కృష్ణ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్స్‌లో పనిచేసి, హెడ్ కానిస్టేబుల్, సబ్ ఇన్స్పెక్టర్‌గా పని చేశారన్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ సరీ్వస్‌లో ఎటువంటి రిమార్క్స్ లేకుండా అంకిత భావంతో పనిచేసి మంచి పేరు సంపాదించారన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి చామంతులతో పూజలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో అభయాంజనేయస్వామికి బుధవారం 1008 చామంతి పూలతో ప్రత్యేక పూజలు జరిపారు. దెందులూరు ఏఎంసీ ఛైర్మన్ అప్పన ప్రసాద్, పద్మావతి దంపతులు పాల్గొని స్వామివారికి చామంతి పూలు, తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజామునుంచి దేవాలయ అర్చకులు సుప్రభాతసేవ, అర్చనలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఏలూరులో 2న సంగీత విభావరి

ఏలూరు (టూటౌన్): ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా జూన్ 2వ తేదీ ఆదివారం సాయంత్రం ఏలూరులో పాటల పల్లకి సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హేలాపురి సింగర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్ నందు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి ఎస్ రవి,కోశాధికారి యు.రవిశంకర్, కమిటీ నాయకులు పి.సూర్యప్రకాష్, కె.శ్రావణ కుమారి మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అనేక భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారని తెలిపారు. ఆయన 78వ జయంతిని పురస్కరించుకొని ఏలూరు వైఎంహెచ్ఏ హాల్ నందు జూన్ 2వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పాటల పల్లకి పేరుతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 40 పాటలతో ఏలూరులోని గాయకులు పాల్గొనేలా కార్యక్రమం రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ లక్ష్మి, ఎం.సిద్ధార్థ సాయి, లహరి, అంకిత, హిమబిందు, జ్ఞానేశ్వరి, సాదిఖ్, భిలాల్ తదితరులు పాల్గొన్నారు.


సినీ సంగీత విభావరికి సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సకల కళాకారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆంధ్రప్రదేశ్ సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక స్నేహం అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కవిరత్న అంబికా రాజా, అధ్యక్షుడిగా దువ్వి రామారావు, ఉపాధ్యక్షుడిగా ఆలపాటి నాగేశ్వరరావు, శలా రాజాబాబు, బొల్లా సత్యనారాయణ, సెక్రటరీగా బళ్ళ నాగ శ్రీనివాస్ (బాబీ), కోశాధికారిగా నాట్యాచార్య దువ్వి హేమసుందర్, మహిళా విభాగం అధ్యక్షుడిగా శలా రాజేశ్వరి, సెక్రటరీగా సీహెచ్.లక్ష్మీ కుమారి ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా గుమ్మడి గోపాలకృష్ణ, నర్రా బుజ్జి, తలశెట్టి మాధవరావు, వైబోయిన బాబు నియమితులయ్యారు. వీరితో పాటు వివిధ రంగాలకు చెందిన మరొక 17 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అంబికా రాజా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులకు చేయూత ఇచ్చేందుకు, కళలను ప్రోత్సహించడానికి ఏర్పడిన సకల కళాకారుల సంఘం గత కొన్ని సంవత్సరాలుగా కళాకారులను వివిధ రూపాల్లో ఆదుకుంటోందన్నారు. ఈ సంఘ అభివృద్ధికి, కళాకారులను ఆదరించే వివిధ కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందజేస్తామన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన సంఘ అధ్యక్షుడు శలా కోటి వీరయ్యకు సమావేశం శ్రద్ధాంజలి ఘటించింది. అనంతరం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కోటుపల్లి నాగేశ్వరరావు వందన సమర్పణ చేశారు.


సకల కళాకారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గానికి ఎన్నికైన ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పర్యావరణంపై చిన్న వయసులోనే విద్యార్థులు అవగాహన కలిగి ఉంటే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చని రిసోర్స్‌పర్సన్ డీ. శ్రీవల్లి సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబరంలో చిన్నారులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లు మన ప్రగతికి మెట్లు అని, పర్యావరణం మనందరి బాధ్యత అని, పర్యావరణాన్ని మనం రక్షిస్తే పర్యావరణం మనని రక్షిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత పర్యావరణంపై స్కిట్ ప్రదర్శింపజేశారు. తొలుత పుస్తక పఠనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత నీతి కథల పుస్తకాలు చదివించి కథల్లోని నీతిని విద్యార్థుల చేతనే చెప్పించారు. అనంతరం యోగాతో కూడిన సరదా క్రీడలు ఆడించారు. విద్యార్థులకు చిత్రలేఖనంలోని మెలకువలు నేర్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది వీటీ సందీప్ కుమార్, అస్లాం పాషా పాల్గొన్నారు.


వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

శ్రవణ నక్షత్ర విశేష పూజలు

భీమడోలు: గుండుగొలను వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం స్వామి వార్లకు శ్రవణ నక్షత్ర ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పూజారులు మంగతి ఆచార్యులు, రవి అచార్యులు శాస్త్రోక్తంగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. స్వామి వారిని సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	07

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	04, 06
బెండకాయలు	44	కంద	60
పచ్చిమిర్చి	84	బీట్‌రూట్	36
కాకర కాయలు	58	కీరా దోస	50
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	180
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	36-50	పాలకూర	12
దొండకాయలు	32	చుక్కకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	54	పుదీనా	05
దోసకాయలు	34	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	44

ఉత్సాహంగా ఎన్‌సీసీ క్యాంప్

- జిల్లా వ్యాప్తంగా 501 మంది విద్యార్థులు హాజరు
- షూటింగ్‌లో అదరగొట్టిన క్యాడెట్స్
- వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

పెదవేగి: పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయంలో గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్ ఉత్సాహంగా సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 501 మంది విద్యార్థులకు ఇండియన్ ఆర్మీ 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ ఎం వెంకటరత్నం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడంతోపాటు వివిధ రకాల ఉద్యోగాల్లో, కళాశాల అడ్మిషన్‌లలో ప్రాధాన్యత కల్పిస్తారు. శిక్షణలో భాగంగా రైఫిల్ షూటింగ్, డ్రిల్, దేశ సరిహద్దుల్లో ఆర్మీ శిబిరాలు ఏ విధంగా ఉంటాయో కళ్లకు కట్టినట్లు చూపించి క్యాడెట్స్‌కు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీలో శిక్షణ ద్వారా దేశభక్తి, నైతిక విలువలు పెంపొందింపజేయడం, క్రమశిక్షణ, సాయం చేసే తత్వం అలవడతాయని అధికారులు పేర్కొంటున్నారు.


పెరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు


రైఫిల్ షూటింగ్ కోసం ఆయుధాలు


డైమండ్ షూటింగ్ విధానం, మెలకువలపై అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

ఏ రంగంలోనైనా రాణించవచ్చు



ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని పాఠశాలల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కచ్చితంగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రతి విద్యార్థికి చదువుతో పాటు, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, వివిధ రకాల నైపుణ్యాలపై నిపుణులచే అవగాహన కల్పిస్తున్నాం. విద్యతోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు.

– సౌరబ్ ముఖర్జీ ఇండియన్ ఆర్మీ 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్

క్యాంప్ చక్కగా ఉపయోగపడుతుంది



యువతకు సరైన రీతిలో శిక్షణ ఇచ్చి విలువలతో కూడిన విద్య అందించడంతోపాటు దేశ రక్షణలో వారి పాత్రను తెలియజేసేందుకు ఇటువంటి క్యాంప్‌లు ఉపయోగపడతాయి. ఆర్మీలో రక్షణ దళం ఎలా పనిచేస్తుంది, రోప్‌తో చేసే విన్యాసాలు, రైఫిల్ షూట్ ఇలా అనేక అంశాలపై అవగాహన కల్పించాం. ఈ క్యాంప్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల మధ్య మంచి వాతావరణం నెలకొల్పడం జరిగింది.

ఎంహెచ్ఎస్ శేఖర్ కుమార్, ఫస్ట్ ఆఫీసర్, భీమవరం

ఆర్మీలో చేరాలనేది నా లక్ష్యం



ఆర్మీలో చేరాలనేది నా లక్ష్యం. దేశ రక్షణలో సుబాష్‌చంద్రబోస్ ఆదర్శంగా తీసుకుని దేశానికి సేవ చేస్తా. ఈ క్యాంప్‌లో ఫైరింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, ఐకమత్యం, క్రమశిక్షణ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

– కె ఝాన్సీ, ఎస్‌కేఎస్‌టీ కళాశాల, తణుకు

ప్రోత్సాహం బాగుంది



నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. ప్రస్తుతం బి సర్టిఫికెట్ చేస్తున్నాను. ఢిల్లీ పెరడ్ చేయాలని, ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో మంచి ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది. మా ఎన్‌సీసీ ఆఫీసర్ నాకు మంచి ప్రోత్సాహం అందిస్తున్నారు.

– జి.మోక్షిత్ సాయిజగన్, సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్, ఏలూరు

ఉన్నతంగా ఎదగడానికి దోహదం



నేను ఐదు క్యాంప్‌లో పాల్గొన్నా. ప్రస్తుతం పెదవేగిలో 10 రోజులపాటు నిర్వహిస్తున్న క్యాంప్ ఎంతో ఉత్సాహంగా జరుగుతుంది. ఇలాంటి శిక్షణా తరగతులు విద్యార్థి జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి ఎంతో చక్కగా ఉపయోగపడతాయి.

– ఎల్ కూషేంద్రకుమార్, కెడెట్, భీమవరం

క్రమశిక్షణతో విజయాలు



ఈ క్యాంప్‌లో క్రమశిక్షణ, అన్ని రకాల స్కిల్స్ ఎంతో శ్రద్ధగా నేర్పిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో ఏ విధంగా ముందుకు వెళ్లాలో చెప్పారు. సమయం సద్వినియోగం చేసుకోవడం నైతిక విలువలతో జీవించడం వంటి ఎన్నో విషయాలు నేర్పుతున్నారు. క్రమశిక్షణతో విజయాలు సాధించవచ్చని అర్థమైంది. ఎం వెంకట మౌనిక, సెయింట్ థెరిస్సా కళాశాల ఏలూరు